పస్తుల విద్య

‘అధికారంలోకి వస్తే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తాం’ అంటూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అధికారం చేపట్టిన తర్వాత కూటమి పెద్దలు విస్మరించారు. 2024–25 విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే ఇంటర్ విద్యార్థులకు కళాశాలల్లో భోజనం అందిస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ స్పష్టమైన హామీ ఇచ్చారు. అయితే విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత హామీని గాలికొదిలేశారు. దీంతో విద్యార్థులకు క్యారియర్ల మోత తప్పడం లేదు. –పూతలపట్టు

- హామీలకే పరిమితమైన ఇంటర్ కళాశాల మధ్యాహ్న భోజనం
- అధికారం చేపట్టి ఐదు నెలలైనా పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- హైస్కూల్ ప్లస్‌లో క్యారియర్లు తెచ్చుకుంటున్న విద్యార్థులు


ఇంటి నుంచి క్యారియర్లు తెచ్చుకుని భోజనం చేస్తున్న హైస్కూల్ ప్లస్ ఇంటర్మీడియట్ విద్యార్థులు

పూతలపట్టు నియోజకవర్గంలో మూడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. అవి పూతలపట్టు, ఐరాల, బంగారుపాళెం మండలాల్లో ఉన్నాయి. వీటిల్లో బాలురు 1,323 మంది, బాలికలు 1,132 మంది చదువుతున్నారు. వీరిలో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే వారి సంఖ్య అధికంగా ఉంది. ఉదయం కళాశాలకు వచ్చే హడావుడిలో పలువురు విద్యార్థులు క్యారియర్లు తీసుకురాలేకపోతున్నారు. దీంతో మధ్యాహ్న సమయంలో వారు పస్తులతోనే ఉండాల్సి వస్తోంది. మరి కొంత మంది తల్లిదండ్రులు స్థోమత లేని విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతుంటారు. వారి పరిస్థితులు ఏమైపోవాలో తెలియడం లేదు.

హైస్కూల్ ప్లస్‌లో ఇదే పరిస్థితి

హైస్కూల్ ప్లస్ పాఠశాలలో ఒకటో తరగతి నుండి పదో తరగతి విద్యార్థుల వరకు ప్రభుత్వం సరుకులను పాఠశాల యాజమాన్యానికి అందజేస్తుంది. ఇంటర్మీడియట్ విద్యార్థులకు లేవు. అయినా సరే ఆయా ప్రధానోపాధ్యాయులు కలిసి మధ్యాహ్న భోజనం సర్దుబాటు చేసుకుని ఇంటర్మీడియట్ విద్యార్థులకు భోజనాన్ని అందిస్తున్నారు. ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. నియోజకర్గంలో 6 హైస్కూల్ ప్లస్‌లు ఉన్నాయి. అందులో సుమారు 150 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆ విద్యార్థులకు ప్రభుత్వం ప్రతి నెలా ప్రత్యేకంగా బియ్యం, కోడిగుడ్లు, పప్పు వంటి సరుకులను అందించడం లేదు. పదో తరగతి విద్యార్థులకు అందించే సరుకులతోనే ఇంటర్మీడియట్ విద్యార్థులు సర్దుకుంటున్నారు. ప్రధానోపాధ్యాయులకు చాలా కష్టంగా మారుతోంది.

కానరాని మెనూ

కొందరు విద్యార్థులు పాఠశాలలో వండే భోజనం నచ్చడం లేదని క్యారియర్లు తెచ్చుకుంటున్నారు. గత ప్రభుత్వంలో మెనూ ప్రకారం పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండేవారు. అదే హైస్కూల్ పిల్లలతో పాటు ఇంటర్మీడియట్ విద్యార్థులు తినేవారు. ఇప్పుడు భోజనం సరిగా లేక క్యారియర్లు తెచ్చుకుంటున్నారు. ప్రభుత్వం హైస్కూల్ విద్యార్థులతో పాటు ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా వంట సరుకులు అందించాలని, వారికి కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని ప్రతి ఉపాధ్యాయుడు కోరుకుంటున్నారు.

విద్యార్థుల విషయంలో మోసం తగదు



ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో చదువుకునే విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుంచి మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తామని ప్రస్తుత విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. అధికారం చేపట్టి ఐదు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు ఊసే లేదు. కూటమి ప్రభుత్వ మోసాలకు ఇది పరాకాష్ట. ఇప్పటికైనా జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించాలి.

–ప్రవీణ్‌కుమార్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్, చిత్తూరు

క్లుప్తంగా

యూహెచ్‌సీలో తనిఖీలు


తనిఖీలో అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం చవటపల్లిలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం గవర్నమెంట్ ఆఫ్ ఇండియా స్పెషల్ టీం తనిఖీ చేసింది. బృందంలోని అధికారులు సుశీల్ విమల్, రాజీనీ తోమార్, నేహా సాటోయాలు సెంటర్‌లో ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. ఈ–సంజీవిని కాల్స్, టీబీ బాధితులకు అందిస్తున్న వైద్య సేవలు, యాప్ వివరాలు నమోదు, ఆశా, ఏఎన్‌ఎంల పనితీరుపై అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో నోడల్ అధికారి విజయలక్ష్మి, డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి, టీబీ అధికారి వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మన చేతుల్లోనే.. మన ఆరోగ్యం


బంగారుపాళెం: తుంబకుప్పంలో ర్యాలీ

బంగారుపాళెం: ఆరోగ్యవంతమైన జీవన విధానం మన చేతుల్లోనే ఉందని మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్ చెంగల్రాయన్ అన్నారు. శుక్రవారం తుంబకుప్పంలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి అలవాట్లు సంపూర్ణ ఆరోగ్యానికి పునాదులన్నారు. పొగాకు, హన్స్, గుట్కాలు నమలడం, ధూమపానంతో ఊపిరితిత్తులు, నోటి, గొంతు, బ్లడ్ క్యాన్సర్లు వస్తాయన్నారు. స్త్రీలకు నోరు, రొమ్ము, గర్భాశయాల క్యాన్సర్ వస్తుందన్నారు. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉంటే ఆరోగ్యం బాగుంటుందన్నారు. జబ్బుని ప్రాథమిక స్థాయిలో గుర్తించి చికిత్స పొందితే ప్రాణాపాయం తప్పుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ సెల్వరాజ్, సీహెచ్‌ఓ నాగమణి, సీహెచ్‌సీ సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: గర్భిణులు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత దూరమవుతుందని పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ వివరించారు. ఆరోగ్య సిబ్బంది అందజేసే ఐరన్ మాత్రలతోపాటు ఆకుకూరలు, పాలు, గుడ్లు, చిక్కీలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులకు బీపీ, షుగర్, యూరిన్ పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఆదిలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే నేరం


మాట్లాడుతున్న ఆనందబాబు

తవణంపల్లె: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన ఉండాలని సహాయ కార్మిక అధికారి ఆనందబాబు తెలిపారు. శుక్రవారం మండలంలోని అరగొండలో జాతీయ బాలల హక్కుల పరిరక్షణ, రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్ భాగస్వామ్యంతో మండల టాస్క్‌ఫోర్స్ కమిటీ ఆధ్వర్యంలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పించారు. బాల కార్మిక వ్యవస్థ నుండి విద్య వైపు ప్రోత్సహించాలని సూచించారు. బాలలను పనిలో పెట్టుకున్న, చిన్న పిల్లలతో పనులు చేయించడం బాల కార్మికుల చట్టం ప్రకారం నేరమన్నారు. కార్యక్రమంలో మండల టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి


కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ శ్రీనివాసులు

బంగారుపాళెం: ఆటోడ్రైవర్లు రహదారి నిబంధనలు పాటించాలని సీఐ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం సాయంత్రం రాగిమానుపెంట, మొగిలి, నలగాంపల్లె, కొదలమడుగు ఆటో స్టాండ్ డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బంగారుపాళెంలో రోడ్లపై ఆటోలు నిలిపి ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా రోడ్డు పక్కన ఆటోలు పార్కు చేసుకోవాలని హెచ్చరించారు. నిబంధనలు పాటించి ఆటోలు నడపాలన్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

13న ఆలయ భూములు కౌలు వేలం

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయానికి చెందిన భూములకు ఈ నెల 13న కౌలు వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మునిరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయం ఆవరణలో ఉదయం 9 గంటలకు భూములు కౌలుకు ఇచ్చేందుకు బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. మండలంలోని మొగిలి, 170 గొల్లపల్లె, టేకుమంద, ఊటువంక గ్రామాల్లో దేవాలయ భూములు ఉన్నాయన్నారు. 2024–25 నుంచి 2026–27 సంవత్సరం వరకు మూడు సంవత్సరాలపాటు కౌలు చేసుకునేందుకు అవకాశం ఉందని వివరించారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు 3 వేల రూపాయలు ధరావత్తు చెల్లించి పాల్గొనాలని సూచించారు. దేవదాయశాఖ అధికారులు జారీచేసిన ఉత్తర్వులను అనుసరించి కౌలువేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిత్తూరు కార్పొరేషన్: సబ్‌స్టేషన్, లైన్ల నిర్వహణ నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చిత్తూరు అర్బన్ ఈఈ మునిచంద్ర శుక్రవారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు. చిత్తూరు నగరం, చిత్తూరు రూరల్, గుడిపాల, పెనుమూరు, జీడీనెల్లూరు, పాలసముద్రం, పూతలపట్టు మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుంని వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

తుతూమంత్రంగా మండల మీట్


మాట్లాడుతున్న ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి

గుడిపాల: ప్రజా సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించేందుకు శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా సాగింది. గుడిపాల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల మీట్‌కు ప్రజా ప్రతినిధులు, అధికారులు నామమాత్రంగా హాజరయ్యారు. అధికారులు శాఖల వారీగా నివేదికలను చదివి ముగించేశారు. కొంతమంది సర్పంచులు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకోలేదు. దీంతో పలువురు ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. మొక్కుబడిగా మండల మీట్ నిర్వహిస్తే ఎలా అంటూ మండిపడ్డారు. సమావేశంలో ఎంపీడీఓ శివరాజన్, స్పెషలాఫీసర్ మధుసూదన్ రెడ్డి, ఎస్‌ఐ రామ్మోహన్ పాల్గొన్నారు.

చీలాపల్లెలో ‘ఫ్యామిలీ డాక్టర్’


వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ అనూష

గుడిపాల: మండలంలోని చీలాపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కింద వైద్యసేవలు అందించారు. బొమ్మసముద్రం ప్రాథమిక ఆరోగ్యాధికారి అనూష మాట్లాడుతూ గ్రామీణులకు పైసా ఖర్చు లేకుండా ఇంటి వద్దకే వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో 47 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి దీర్ఘకాలిక వ్యాధులతో మంచంపైన ఉన్న రోగులకు చికిత్సలందించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సుప్రియ, శిరీష, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి


బాల కార్మిక వ్యవస్థపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఐరాల: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరి కృషి అవసరమని సహాయ కార్మిక అధికారి ఆనంద్ బాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై మండల టాస్క్‌ఫోర్సు కమిటీ సభ్యులతో కలిసి దుకాణాలు, ప్రైవేటు సంస్థలలో తనిఖీలు చేసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలను పనిలో పెటుకున్నా, వారితో పనులు చేయించినా చట్టరీత్యా నేరమని, యజమానులకు తీవ్రమైన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు సహకరించాలని షాపుల యజయానులను కోరారు. బడిలో పాఠాలు నేర్చుకుని విద్యావంతులుగా తీర్చిదిద్దాల్సిన వారిని పనిలోకి పంపడం, పనిలో చేర్చుకోవడం నేరమని స్పష్టం చేశారు. గ్రేట్ విజన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ 18 సంవత్సరాల్లోపు పిల్లలు చదువుకోవడానికి ఇబ్బంది పడుతుంటే తమ సంస్థ ద్వారా వారికి విద్యా, వైద్యంతోపాటు సకల సౌకర్యాలు అందిస్తామని తెలిపారు. ఇలాంటి పిల్లలు ఎవరైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓలు రుషేంద్రబాబు, దామోదర్ నాయుడు, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ 1098 అధికారి సవిత, సీడీపీఓ నిర్మల, పీహెచ్‌ఎన్ జీవకళ పాల్గొన్నారు.

కుస్తీపోటీల లోగో ఆవిష్కరణ


లోగో ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ

చిత్తూరు కలెక్టరేట్: రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల లోగోను శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు యాదమరి జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో నిర్వహించే రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలను జాగ్రత్తగా నిర్వహించాలని ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు కుస్తీ పోటీల్లో పాల్గొనేందుకు వస్తారని, వారికి తగిన వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి పోటీలను పర్యవేక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ వరలక్ష్మి, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా సెక్రటరీ వసంతవాణి, సహాయ కార్యదర్శులు కృష్ణయ్య, బాబు, రవీంద్రర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌ను వినియోగించుకోండి


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: గ్రామీణ ప్రజలు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ కోరారు. శుక్రవారం మండలంలోని దివిటివారిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 70 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగు పరుచుకోవాలని సూచించారు. అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. దోమకాటుతో సంభవించే వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి


దిగువ తడకరలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ కేశవనారాయణ


ఉప్పాంకలో బీపీ పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

తవణంపల్లె: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరు శ్రద్ధ చూపాలని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ వినయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ఉప్పాంకలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు 104 మొబైల్ క్లినిక్‌లో పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. ఆరోగ్యమే మహా భాగ్యంగా భావించాలన్నారు. గర్భవతులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. తాజా ఆకుకూరలు, కూరగాయలు భుజించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తహీనత రాకుండా జాగ్రత్తలు

గర్భవతులు రక్తహీనత రాకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ తెలిపారు. శుక్రవారం మండలంలోని దిగువ తడకరలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 35 మంది రోగులకు వైద్య పరీక్షలు చేయించారు. గర్భవతులు, బాలింతలు, చిన్న పిల్లలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పశు సహాయకులకు అదనపు బాధ్యతలు

చిత్తూరు రూరల్(కాణిపాకం): జిల్లాలోని పశుసంవర్ధక శాఖ సహాయకులకు అదనపు బాధ్యతలు అప్పగించారు. స్కిల్ సెన్సస్ జియో ట్యాగింగ్ సర్వేను అంటకట్టారు. దీంతో వారు బాధ్యతలను వదిలి అదనపు పనులకు పరిమితమయ్యారు. ప్రభుత్వం కొత్తగా నైపుణ్య గణన జియో ట్యాగింగ్ సర్వేను చేపట్టింది. ఈ సర్వేను పంచాయతీ కార్యదర్శులు, ఇతర సచివాలయ సిబ్బంది చేయాల్సి ఉంది. కానీ పశుసంవర్ధకశాఖ సహాయకులకు ఆ సర్వే పనులను అప్పగించారు. అయితే గత నెల 26వ తేదీ నుంచి వీరికి పశుగణన సర్వే చేయాలని ఆదేశాలు ఉన్నాయి. ఆ సర్వేతో ఇంటింటా తిరుగుతూ పశు వైద్య సేవలను నిర్వర్తిస్తున్నాయి. కానీ ఇలాంటప్పుడు స్కిల్ సెనస్స్ జియోట్యాగింగ్ సర్వేను అప్పగించడంపై సర్వత్ర విమర్శలు వస్తున్నాయి. రెండు సర్వేలు ఎలా చేయాలని సహాయకులు ప్రశ్నిస్తే..పశు గణనను పక్కన పెట్టి..స్కిల్ సర్వేను చేయాలని పంచాయతీ కార్యదర్శులు హుకుం జారీ చేస్తున్నారని సహాయకులు వాపోతున్నారు. లేనిపక్షంలో షోకాజ్ నోటీసులు తప్పవని హెచ్చరిస్తున్నారు. దీంతో చేసేది లేక చాలా మంది శుక్రవారం స్కిల్ సర్వేకు పరిమితమయ్యారు. ఈ కారణంగా పశువైద్యం కోసం పాడిరైతులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఇక కలెక్టర్ పశుగణన సర్వే లక్ష్యాన్ని పూర్తి చేయాలని, అదనపు పనులకు వెళ్లొద్దని ఇటీవలే ఆదేశాలిచ్చారు. అయితే స్థానిక అధికారులు ఈ ఆదేశాలను బేఖాతరు చేస్తూ.. అదనపు పనులు చేయించడంపై విమర్శలు వస్తున్నాయి.

మొక్కుబడిగా ‘పొలం పిలుస్తోంది’

సేద్యంలో మెలకువలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం పొలం పిలుస్తోంది పేరిట ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తోంది. అయితే వ్యవసాయశాఖ అధికారుల నిర్లక్ష్యంతో లక్ష్యం నీరుగారిపోతోంది. మొక్కుబడి కార్యక్రమాలు చేపడుతుండడంపై రైతులను అసహనం వ్యక్తమవుతోంది. సకాలంలో సలహాలు అందిడంలేదనే అసంతృప్తి అధికమవుతోంది. కొన్నిశాఖల సిబ్బంది మాత్రమే అలా వచ్చి.. ఇలా వెళ్లిపోతుండడంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనుబంధ శాఖ అధికారులు గైర్హాజరు కావడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


పొలం పిలుస్తోందిలో కనిపించని వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు (ఫైల్)


రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు (ఫైల్)

- హాజరుకాని వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు
- రైతులకు అందని సలహాలు, సూచనలు
- తూతూమంత్రంగా నిర్వహణపై వెల్లువెత్తుతున్న విమర్శలు

గుడిపాల: వ్యవసాయ అధికారులు నిర్వహిస్తున్న పొలంపిలుస్తోంది సదస్సులు తూతూమంత్రగా సాగుతున్నాయి. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు హాజరు కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. అప్పుడప్పుడు కొన్ని శాఖల అధికారులు హాజరైనా సలహాలు సూచనలు అందించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఆహార, వాణిజ్య, పండ్లు, పూలతోటలు, పట్టు తదితర సాగు రైతులకు ఉన్న సందేహాలను తీర్చి నాణ్యమైన మంచి దిగుబడులు సాధించేలా చైతన్య పరిచేందుకు పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అయితే గుడిపాల మండలంలో వ్యవసాయశాఖ అధికారులు మాత్రమే పొలం పిలుస్తోందికి వచ్చి రైతులతో మాట్లాడుతున్నారు. అనుబంధ శాఖల అధికారులు పూర్తిస్థాయిలో రావడం లేదు. వ్యవసాయ శాఖతో పాటు ఆత్మ, సెరికల్చర్, ఉద్యానశాఖ, పశుసంవర్థకశాఖ, డెయిరీ డెవలప్‌మెంట్, కో–పరేటివ్ పెడరేషన్, మార్కెటింగ్‌శాఖ, ఇరిగేషన్, విద్యుత్, ప్రకృతి వ్యవసాయ తదితర సుమారు పదిశాఖల అధికారులు విధిగా హాజరు కావాల్సి ఉంది. వాస్తవానికి ఒకటి, రెండుశాఖల అధికారులు మొక్కుబడిగా వస్తున్నారు. వ్యవసాయశాఖ సిబ్బంది మాత్రం రైతుసేవా కేంద్రాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నా రైతుల నుంచి స్పందన లేదు. దీంతో పొలం పిలుస్తోంది ఫొటోలకే పరిమితమైందని పలువురు విమర్శిస్తున్నారు.


షెడ్యూల్ ఇదీ..

సెప్టెంబర్ 24వ తేదీ ప్రారంభమైన పొలం పిలుస్తోంది కార్యక్రమం 2025 జనవరి 2వ తేదీ వరకు పల్లెల్లో నిర్వహించాల్సి ఉంది. వారంలో రెండురోజుల పాటు మంగళ, బుధవారాల్లో కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు. రోజుకు రెండు గ్రామాలు చొప్పున ప్రతి వారం నాలుగు పల్లెల్లో చేపట్టాల్సి ఉంది. మండలంలోని 27 పంచాయతీల్లో ఉన్న 32 రెవెన్యూ గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించేందుకు వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకున్నారు. అనుబంధ శాఖల అధికారులు హాజరయ్యేలా ప్రణాళికలు రూపొందించినా ఫలితం కనిపించడం లేదు.

పొలాల్లోకి వెళ్లి ఫొటోలు దిగి..


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు సాగు వ్యయం తగ్గింపు చర్యలపై అధికారులు అవగాహన కల్పించాల్సి ఉంది. అయితే వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు డుమ్మా కొడుతున్నారు. వ్యవసాయ అధికారులు మాత్రం ఎంపిక చేసిన రైతుల పంట పొలాల్లోకి వెళ్లి ఫొటోలు దిగి వెళుతున్నారు.

రావడం లేదు



పండ్లు, పూల తోటలకు ముందుకు రావాలని రైతులను అధికారులు వెంటపడి పంటలను నాటిస్తారు. మొక్కలు నాటుకున్నాక సంబంధిత అధికారులు ఎవరూ కూడా మా దగ్గరకి రావడం లేదు. పండ్ల తోటలను సాగు చేపట్టిన మాలాంటి రైతులు వాటిని ఎలా కాపాడుకోవాలో తెలియక అవస్థలు పడుతున్నాం. పంటల సంరక్షణ, మంచి దిగుబడులు ఎలా సాధించాలన్నా కొత్త విషయాలు తెలియడం లేదు. –జ్యోతి, రైతు, చీలాపల్లె

అందుబాటులో ఉండాలి:



పొలం పిలుస్తోంది కార్యక్రమాలకు సంబంధిత అధికారులు సక్రమంగా హాజరు కావడం లేదు. అన్నిశాఖ వారు హాజరై ప్రభుత్వ పథకాలు, పంటల సంరక్షణ పద్ధతులను తెలియజేస్తే బాగుంటుంది. ప్రత్యేక కార్యక్రమాలకు సైతం అధికారులు గైర్హాజరు కావడం మంచిది కాదు. ఇప్పటికైనా పొలం పిలుస్తోందికి, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు రావాలి. రైతులకు నిత్యం అందుబాటులో ఉండాలి.

–రజనీకాంత్, సర్పంచ్, వసంతాపురం


సమాచారం ఇచ్చాం

ప్రతివారం నాలుగు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నాం. సదస్సుల నిర్వహణపై అన్నిశాఖల అధికారులకు షెడ్యూల్ పంపించాం. అదేవిధంగా ఆయా గ్రామాల రైతులకు సైతం ముందురోజే సమాచారం ఇస్తున్నాం. కొన్ని గ్రామాలలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఆత్మ, ఉద్యానవన, వెటర్నరీ అధికారులు మాత్రం వచ్చారు. రైతులకు అన్నిరకాల సలహాలు, సూచనలు ఇస్తున్నాం.

–మాధవి, వ్యవసాయాధికారి, గుడిపాల

శరీరంపై దృష్టి వద్దు

- గరికపాటి నరసింహారావు


ప్రవచిస్తున్న గరికపాటి నరసింహారావు

చిత్తూరు రూరల్(కాణిపాకం): శరీరంపై దృష్టి తగ్గించి మనసుపై దృష్టి పెడితే మానవ సమాజానికి మంచిదని గరికపాటి నరసింహారావు అన్నారు. చిత్తూరు నగరంలోని నాగయ్య కళాక్షేత్రంలో శుక్రవారం యోగవాశిష్యంపై ప్రవచనాలు ప్రారంభయ్యాయి. తొలుత అమ్మవారికి పూజలు చేసి ప్రవచనాలను ప్రారంభించారు. ఆయన ప్రవచిస్తూ... శరీరానికి జబ్బులు రావడం లేదన్నారు. మనసులోని ఆలోచనలే జబ్బులను తీసుకొస్తున్నాయన్నారు. ముందు మానసిక ఆందోళనను దూరం చేసుకోవాలన్నారు. శరీరం అందంగా కనిపించాలని వ్యాయామం, క్రీములు రాస్తే సరిపోదన్నారు. మనస్సుకు వైద్యం చేయించాలన్నారు. దీనివల్ల 30 ఏళ్లకే మధుమేహం, బీపీలు వస్తున్నాయన్నారు. ఫోన్ అనే చెత్తను దూరం పెట్టి పుస్తకాలు చేతబట్టాలన్నారు. రాత్రీపగలు ఆ ఫోన్‌లోని చెత్తను బుర్రలో వేసుకుని మనుసును పాడు చేసుకుంటున్నారని పేర్కొన్నారు.


హాజరైన ప్రజలు